క్లుప్తంగా

లారీలు ఢీకొని డ్రైవర్‌కు గాయాలు



కోవూరు : ముందు వెళ్తున్న లారీని మరో లారీ వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్‌కు గాయాలయ్యాయి. ఈ ఘటన పడుగుపాడు సమీపంలో జాతీయ రహదారిపై బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. చిల్లకూరు నుంచి సిలికా లోడ్‌తో ఉన్న లారీ కర్ణాటకలోని హోస్పేటకు వెళ్తుండగా పడుగుపాడు సమీపంలో ముందు వెళ్తున్న మరో లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సిలికా లారీ ముందు భాగం దెబ్బతినగా, డ్రైవర్ గుణశేఖర్‌కు కాలు విరిగింది. క్షతగాత్రుడిని 108 సాయంతో నెల్లూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న కోవూరు ఎస్సై దాసరి వెంకటేశ్వరరావు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం గురించి ఆరాతీశారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఇసుక టిప్పర్ల సీజ్



కోవూరు : అనుమతుల్లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న రెండు టిప్పర్లను కోవూరు సెబ్ సీఐ నరహరి, ఎస్సై శ్రీనివాస్ తమ బృందంతో దాడులు చేసి బుధవారం పట్టుకున్నారు. వారి సమాచారం మేరకు.. వెంకటేశ్వరపురం వద్ద పెన్నానది నుంచి జాతీయ రహదారిపై ఇసుక లోడ్‌తో టిప్పర్లు వెళ్తున్నాయనే సమాచారం అందడంతో వారు తనిఖీలు చేసి టిప్పర్లను పట్టుకున్నారు. ఇద్దరు డ్రైవర్లను అరెస్ట్ చేశారు. సీజ్ చేసిన వాహనాలతో సహా డ్రైవర్లను కోవూరు పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు గొలగమూడి విద్యార్థిని

వెంకటాచలం : రాష్ట్రస్థాయి అండర్–14 స్కూల్ గేమ్స్ ఖోఖో పోటీలకు గొలగమూడి వద్దనున్న ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న బి.శ్రావణి ఎంపికైనట్లు హెచ్‌ఎం బి.లక్ష్మీకామేశ్వరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 17 నుంచి 19వ తేదీ వరకు విశాఖలోని బీహెచ్‌పీవీ గ్రౌండ్‌లో జరుగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో శ్రావణి పాల్గొంటుందని తెలియజేశారు.

వేడుకగా ధ్వజారోహణ

కొడవలూరు : మండలంలోని గండవరంలో కొలువైన గంగా పార్వతి సమేత ఉదయకోశ్వస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ధ్వజారోహణ కార్యక్రమం బుధవారం వేడుకగా నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి శేష వాహనంపై కొలువుదీరిన స్వామిని భక్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం స్వామి అమ్మవార్లకు అత్యంత వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామ వీధుల్లో ఊరేగుతున్న స్వామికి భక్తులు నైవేద్యాలు సమర్పించారు. ఆలయ అర్చకులు బండారు సుబ్రహ్మణ్యం, సర్వబొట్ల హరిప్రసాద్ పూజలు చేశారు. కార్యనిర్వహణాధికారి బి.శాంతయ్య, రామిరెడ్డి రాజేష్‌రెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నిబంధనలు తప్పక పాటించాలి

కోవూరు : ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో కోడ్ అమలులో ఉందని, ప్రతి ఒక్కరూ నిబంధనలు తప్పక పాటించాలని తహసీల్దార్ పద్మజ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో పలు రాజకీయ పార్టీల నేతలతో ఆమె బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఎక్కడా ఎన్నికల కోడ్ ఉల్లంఘన చేయరాదన్నారు. ప్రభుత్వ స్థలాల్లో సభలు ఏర్పాటు చేయరాదన్నారు. ఎక్కడైనా సమావేశాలు నిర్వహించుకోవాలంటే ముందుగా అనుమతి తీసుకోవాలన్నారు. రాజకీయ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం మండలాధ్యక్షుడు మల్లవరపు చిరంజీవి, మండల సచివాలయాల కన్వీనర్ కవరగిరి ప్రసాద్, పలు రాజకీయ పార్టీల నేతలు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి

బుచ్చిరెడ్డిపాళెం : తూర్పు రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అన్ని రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు సహకరించాలని ఎంపీడీఓ నరసింహారావు, తహసీల్దార్ పద్మజ కోరారు. బుచ్చిరెడ్డిపాళెంలోని ఎంపీడీఓ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులతో వారు బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం ఎన్నికల నియమావళి అమలులో ఉందని, దీనిని అన్ని రాజకీయ పార్టీల వారు తప్పకుండా పాటించాలని కోరారు. అలాగే మార్చి 13వ తేదీన జరిగే ఎన్నికలకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు.

పురుషామృగ వాహనంపై మూలస్థానేశ్వరుడు



నెల్లూరు(బృందావనం): మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి వారు పురుషామృగ వాహనంపై బుధవారం దర్శనమిచ్చారు. చప్పరోత్సవాన్ని ఉదయం నిర్వహించారు. ఆయా సేవలకు ఉభయకర్తలుగా మోహన్, కస్తూరి, జితేంద్రవర్మ, హైంద్రి, తదితరులు వ్యవహరించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శేషవాహన సేవను గురువారం రాత్రి ఏడు గంటలకు నిర్వహించనున్నారు.

ఘనంగా గంధ మహోత్సవం



నెల్లూరు రూరల్: కొత్తూరు పరిధిలోని శ్రామికనగర్‌లో ఖాజాగరీబ్‌నవాజ్ గంధ మహోత్సవాన్ని వేడుకగా బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గంధాన్ని పలు ప్రాంతాల్లో ఊరేగించి భక్తులకు అందజేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. దర్గా కమిటీ సభ్యులు మాసుంవలీ, రహమత్‌బాషా, యజ్దానీ, బిహార్‌బాబు పర్యవేక్షించారు.

నడిరోడ్లపైనే ఆవులు



నెల్లూరు(మినీబైపాస్): గోవుల ఆలనాపాలనను యజమానులు విస్మరిస్తున్నారు. వీటిని రోడ్లపై ఇష్టారాజ్యంగా వదిలేస్తున్నారు. ఫలితంగా అవి రోడ్లపై తిష్టవేస్తూ రాకపోకలకు ఇబ్బంది కలిగించడంతో పాటు కొన్ని సందర్భాల్లో వాహనాలు ఢీకొని గాయపడుతున్నాయి. కేవీఆర్ పెట్రోల్ బంక్, ఆర్టీసీ, కూరగాయల మార్కెట్, వీఆర్సీ, ఫతేఖాన్‌పేట, తదితర ప్రాంతాల్లో సమస్య తీవ్రంగా ఉంది. జిల్లా కోర్టు సమీపంలో వాహనం ఢీకొనడంతో ఇటీవల ఓ ఆవు గాయపడింది. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): శెట్టిగుంటరోడ్డు సబ్‌స్టేషన్ పరిధిలోని ఫీడర్‌లో 33 కేవీ లైన్లను ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా గురువారం ఉండదని ఈస్ట్ – 1 ఏఈ మన్మథరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శెట్టిగుంట రోడ్డు, మైపాడు గేట్, శ్రీనివాసనగర్, తదితర ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 1.30 వరకు సరఫరా ఉండదని చెప్పారు.

18 నుంచి కృష్ణ మందిరంలో పూజలు

నెల్లూరు(బృందావనం): మహాశివరాత్రిని పురస్కరించుకొని సుజాతమ్మ కాలనీలోని కృష్ణయోగ మందిర ప్రాంగణంలో విశేష పూజలను శని, ఆదివారాల్లో నిర్వహించనున్నామని గణపతి సచ్చిదానంద కృష్ణ జ్ఞానబోధ సభ ట్రస్ట్ కార్యనిర్వహణ ట్రస్టీ అజయ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మందిర ప్రాంగణంలోని అష్టలక్ష్మి అమ్మవారు, ఆంజనేయస్వామి, ఉమాదేవి సమేత నాగేశ్వరస్వామి ఆలయాల్లో శనివారం ఉదయం ఆరు నుంచి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, ఏక రుద్రాభిషేకాలు, సాయంత్రం 5.30కు నందీశ్వరుడు, నాగేశ్వరస్వామికి ప్రదోషకాల పూజలు, రాత్రి 11కు లింగోద్భవకాల అభిషేకం, తదితరాలను నిర్వహించనున్నామని చెప్పారు. పాల్గొనాలనుకునే భక్తులు 94415 48655 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

క్రైమ్ కార్నర్

దోపిడీ కేసులో పురోగతి

నెల్లూరు(క్రైమ్): న్యూ మిలటరీ కాలనీలో జరిగిన దోపిడీ కేసులో వేదాయపాళెం పోలీసులు కొంత పురోగతి సాధించారని సమాచారం. ఘటన జరిగిన ఇంటి సమీపంలోని సీసీ ఫుటేజీలను సేకరించిన పోలీసులు వాటిని క్షుణ్ణంగా పరిశీలించారు. నిందితులు చేతికి గ్లౌజ్‌లు, మొహానికి గుడ్డలు కట్టుకొని కారులో వచ్చి దోపిడీ చేసి వెళ్లారనే అంశాన్ని గుర్తించారని తెలిసింది. కారు జీఎన్టీ రోడ్డు వైపు వెళ్లినట్లు సీసీ ఫుటేజ్‌లో ఉంది. నిప్పో, వేదాయపాళెం వైపు ఉన్న సీసీ టీవీలు పనిచేయక పోవడంతో అక్కడి నుంచి కారు ఏ వైపు వెళ్లిందో తెలియరాలేదు. దీంతో ఆ రహదారి వెంబడి ఉన్న సీసీ ఫుటేజీల పరిశీలనలో పోలీసులు నిమగ్నమయ్యారు.

వ్యక్తిపై దాడి

నెల్లూరు(క్రైమ్): గోడపైన రేకుల విషయమై వ్యక్తిపై కొందరు దాడి చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. వారధి సెంటర్‌లో హుస్సేన్, ఖాజారహంతుల్లా పక్కిళ్లలో నివాసం ఉంటున్నారు. ఒకే గోడకు రెండు వైపులా రేకుల వరండాను వేసుకున్నారు. ఈ క్రమంలో గోడపై ఉన్న రేకులను తొలగించాలని ఖాజారహంతుల్లాను హుస్సేన్ మంగళవారం కోరారు. దీంతో వీరి మధ్య వివాదం చోటుచేసుకుంది. హుస్సేన్‌పై ఖాజారహంతుల్లా, అతని కుటుంబసభ్యులు దాడి చేసి గాయపర్చారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సంతపేట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో..

వ్యక్తిపై దాడి చేసిన ఘటనపై నవాబుపేట పోలీసులు కేసును బుధవారం నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. మినీబైపాస్‌లోని శ్రీనగర్ కాలనీకి చెందిన రమేష్, రామలింగాపురానికి చెందిన నవీన్ నడుమ ఆర్థిక విభేదాలున్నాయి. ఈ నేపథ్యంలో ఈ నెల 12న రమేష్ తన స్నేహితులు శ్రీనివాసులు, జయరామయ్యానాయుడితో తడికల బజార్ సెంటర్‌లోని యాక్సిస్ బ్యాంక్ ఏటీఎం కేంద్రం వద్ద మాట్లాడసాగారు. దీంతో అక్కడికి వచ్చిన నవీన్‌తో వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో ఆగ్రహానికి గురైన నవీన్ ఆయనపై రాయితో దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మద్యానికి డబ్బులివ్వలేదనే అక్కసుతో..

నెల్లూరు(క్రైమ్): మద్యం తాగేందుకు డబ్బులివ్వలేదనే కారణంతో వ్యక్తిపై కొందరు దాడి చేసి గాయపర్చారు. పోలీసుల సమాచారం మేరకు.. బుజబుజనెల్లూరులోని సమతానగర్‌లో లారీ క్లీనర్ రహమతుల్లా నివాసం ఉంటున్నారు. వల్లూరమ్మ కాలనీలోని బ్రాందీషాపునకు బుధవారం సాయంత్రం ఆయన వెళ్లారు. అక్కడ మద్యం సేవిస్తుండగా.. తాగేందుకు డబ్బులివ్వాలని కొందరు కోరారు. తన వద్ద లేవని చెప్పడంతో ఆగ్రహానికి గురైన వారు ఇటుక రాళ్లతో దాడి చేసి పరారయ్యారు. గాయపడిన ఆయన్ను స్థానికులు 108 సాయంతో జీజీహెచ్‌కు తరలించారు. ఘటనపై వేదాయపాళెం పోలీసులకు బాధితుడి సోదరుడు రసూల్‌బాషా ఫిర్యాదు చేశారు.

డబ్బులు అడిగినందుకు..

పని చేసినందుకు డబ్బులివ్వాలని అడిగిన వ్యక్తిపై యజమాని దాడి చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు.. ప్రగతినగర్ బీ బ్లాక్‌కు చెందిన రవికుమార్ అదే ప్రాంతానికి చెందిన వెంకటేష్ వద్ద ఎలక్ట్రీషియన్ పనులు చేసుకొని జీవనం సాగిస్తున్నారు. ఈ నెల 13న పని తాలూకు డబ్బులివ్వాలని రవికుమార్ అడగ్గా, ఆయన రాళ్లతో దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు దర్గామిట్ట పోలీసులు కేసు నమోదు చేశారు.

వివాహిత అదృశ్యం

నెల్లూరు(క్రైమ్): ఇంటి నుంచి వివాహిత అదృశ్యమైన ఘటనపై వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. బీవీనగర్‌లో నివాసం ఉంటున్న జనార్దన్ నగరంలో సెల్‌ఫోన్ షాపును నిర్వహిస్తున్నారు. దుకాణానికి బుధవారం వెళ్లగా, ఆయన భార్య ఇంటి నుంచి అదృశ్యమయ్యారు. పలుమార్లు ఫోన్ చేసినా స్విచ్ఛాఫ్ అని వచ్చింది. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

నేత్రదానం



కౌసల్యమ్మ (ఫైల్)

నెల్లూరు(అర్బన్): బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని దామరమడుగుకు చెందిన కౌసల్యమ్మ (88) తన స్వగృహంలో మృతి చెందారు. ఈ క్రమంలో కుటుంబసభ్యుల అంగీకారంతో ఆమె నేత్రాలను పెద్దాస్పత్రి నేత్రదాన మోటివేటర్ బాలాజీసింగ్, ఎల్వీ ప్రసాద్ ఐ ఆస్పత్రి టెక్నీషియన్ లాలేష్ సేకరించారు. అనంతరం కుటుంబసభ్యులకు సర్టిఫికెట్‌ను అందజేశారు. నేత్రదానం చేయాలనుకునే వారు 99481 64781, 93471 11033 నంబర్లను సంప్రదించాలని బాలాజీసింగ్ కోరారు.

హోమ్‌గార్డును దూషించి విధులకు ఆటంకం

నెల్లూరు(క్రైమ్): పోలీస్‌స్టేషన్ ఆవరణలో వీడియో తీస్తుండగా అడ్డుకున్న హోమ్‌గార్డును దూషించడంతో పాటు విధులకు ఆటంకం కలిగించిన ఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. వివరాలు.. రంగనాయకులపేటకు చెందిన ప్రభాకర్ నవాబుపేట పోలీస్‌స్టేషన్‌లో హోమ్‌గార్డుగా విధులు నిర్వర్తిస్తున్నారు. నవాబుపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉంటున్న అనిత, ఆమె కుమారుడు మంగళవారం రాత్రి స్టేషన్‌కు వచ్చారు. సీఐను కలవాలని చెప్పగా, ఐదు నిమిషాలు ఉండాలని రిసెప్షనిస్ట్ సూచించారు. దీంతో వారు రిసెప్షనిస్ట్‌తో గొడవపడ్డారు. అనిత కుమారుడు సెల్‌ఫోన్లో వీడియో తీస్తుండగా హోమ్‌గార్డు వారించారు. దీంతో హోంగార్డును తీవ్రపదజాలంతో దూషించడమే కాకుండా విధులకు ఆటంకం కలిగించారు. హోమ్‌గార్డు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పంట నమోదును పూర్తి చేయాలి



పంట నమోదును పరిశీలిస్తున్న రాజ్‌కుమార్

ముత్తుకూరు : మండలంలోని అన్ని గ్రామాల్లో పంట నమోదు ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని ఇందుకూరుపేట వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు రాజకుమార్ తెలిపారు. మండలంలోని మామిడిపూడి, నేలటూరు, మొగళ్లూరు, బ్రహ్మదేవి తదితర గ్రామాల్లో వరి పైరును బుధవారం మండల వ్యవసాయాధికారి జ్యోత్స్నరాణితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రైతు భరోసా కేంద్రాల్లో సిబ్బంది నమోదు చేసిన పంట నమోదు సర్వే నంబర్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. పంట నమోదు పూర్తయిన తర్వాత రైతుల చేత ఈ–కేవైసీ వంద శాతం పూర్తి చేయాలని గ్రామ వ్యవసాయ సహాయకులను ఆదేశించారు. ప్రభుత్వం ద్వారా ధాన్యం కొనుగోలుకు ఈ ప్రక్రియ ఎంతో ఉపకరిస్తుందన్నారు. అవసరమైతే రైతుల ఇళ్లకు వెళ్లి వారి వేలిముద్రలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

పరీక్షలపై భయం వీడాలి



సూచనలు చేస్తున్న ఉషారాణి

కొడవలూరు : పరీక్షల పట్ల ఉన్న భయం, అపోహలు వీడాలని సమగ్ర శిక్ష అభియాన్ అడిషనల్ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్(ఏపీసీ) ఉషారాణి సూచించారు. మండలంలోని నార్తురాజుపాళెంలో ఉన్న జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం 'పరీక్షా పర్వ్ 4.0' కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య వక్తగా విచ్చేసిన ఆమె మాట్లాడుతూ విద్యా సంస్థల్లో పరీక్షలను వేడుకలుగా నిర్వహించేలా చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విద్యా విభాగాలు పరీక్షా పర్వ్ 4.0 కార్యక్రమాన్ని ప్రవేశపెట్టినట్లు తెలిపారు. విద్యార్థులు ఇష్టపడి చదివేలా చేయడం, పరీక్షలకు కాకుండా వేడుకలకు హాజరవుతున్నామన్న భావన కలిగించేలా చేయడం ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమన్నారు. పది పరీక్షలకు 46 రోజుల సమయం ఉన్నందున సబ్జెక్టుల వారీగా ప్రణాళిక రూపొందించుకుని సందేహాలు నివృత్తి చేసుకొంటూ చదవడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. అనంతరం ఆమె విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ జి.వసంత కుమారి, డైట్ అధ్యాపకుడు విజయచంద్ర, పాఠశాల హెచ్‌ఎం డి.ఓబులేసు, ఉపాధ్యాయులు రఫీ, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు మంత్రి అభినందన



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): అంతర్జాతీయ స్క్వే మార్షల్ ఆర్ట్స్ క్రీడాకారులను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తన క్యాంప్ కార్యాలయంలో బుధవారం అభినందించారు. ఈ సందర్భంగా స్క్వే అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ ఇస్మాయిల్ మాట్లాడారు. నేపాల్లో ఈ నెల రెండు నుంచి ఐదు వరకు నిర్వహించిన సౌతాసియా స్క్వే మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో రాష్ట్ర జట్టులోని క్రీడాకారులు నాలుగు స్వర్ణ, రెండు రజత, ఒక కాంస్య పతకాన్ని సాధించారని వివరించారు. అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఇబ్రహీం, జిల్లా కార్యదర్శి ఆదినారాయణ, కరిముల్లా, తదితరులు పాల్గొన్నారు.

జక్కా పార్వతమ్మకు ఘన నివాళి



పార్వతమ్మ (ఫైల్)



నివాళులర్పిస్తున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మధు, తదితరులు

నెల్లూరు(వేదాయపాళెం): సీపీఎం ఉద్యమ నిర్మాత, దివంగత నేత జక్కా వెంకయ్య సతీమణి పార్వతమ్మ ఏసీనగర్‌లోని ఆమె నివాసంలో మంగళవారం రాత్రి మృతి చెందారు. ఆమె భౌతికకాయానికి సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మధు, టీడీపీ నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఎం నేత రాజగోపాల్, జిల్లా కార్యదర్శి రమేష్, వెంకటేశ్వర్లు, మోహన్‌రావు, శ్రీనివాస్, మస్తాన్‌బీ, అన్నపూర్ణమ్మ, నగర, రూరల్ కార్యదర్శులు శ్రీనివాసులు, కృష్ణయ్య నివాళులర్పించారు. కార్యకర్తల సందర్శనార్థం ఆమె పార్థివదేహాన్ని బాలాజీనగర్‌లోని సీపీఎం జిల్లా కార్యాలయానికి తరలించారు. అంతిమయాత్రలో పెద్ద సంఖ్యలో సీపీఎం కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు. బోడిగాడితోటలోని శ్మశాన వాటికలో పార్వతమ్మ అంత్యక్రియలను నిర్వహించారు.

మోడల్ పరీక్షకు విశేష స్పందన



నెల్లూరు (టౌన్): ఎస్‌ఎఫ్‌ఐ, యూటీఎఫ్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు బుధవారం నిర్వహించిన మోడల్ పరీక్షకు విశేష స్పందన లభించిందని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి హర్ష, శ్రీనివాసులు పేర్కొన్నారు. ఈ మేరకు వారు విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని 14 మండల కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షకు 3400 మంది విద్యార్థులు హాజరయ్యారని చెప్పారు. ప్రతిభ చూపిన మొదటి పది మందికి షీల్డ్, సర్టిఫికెట్లను అందజేయనున్నామని పేర్కొన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ నేతలు నరేంద్ర, అనిల్, సుకుమార్, సంతోష్, వినీత్, బాబీ, అజయ్, తదితరులు పాల్గొన్నారు.

హాఫీజ్ పాషా అక్రమాలపై విచారణకు వినతి



మాట్లాడుతున్న రషీద్

నెల్లూరు(అర్బన్): ఏఎస్‌పేటలోని హజరత్ సయ్యద్ ఖాజారహంతుల్లా నాయబ్ రసూల్ దర్గా పీఠాధిపతి హాఫీజ్ పాషాపై వచ్చిన ఆరోపణలు, అక్రమాలపై పూర్తి స్థాయి విచారణ చేపట్టాలని ఆవాజ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రషీద్ కోరారు. ఈ మేరకు డీఆర్వోకు వినతిపత్రాన్ని బుధవారం అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. పదవి నుంచి హాఫీజ్ పాషాను తొలగించి దర్గా పరిపాలన సజావుగా జరిగేలా చూడాలని కోరారు. చాన్‌బాషా, అక్బర్, జావీద్, తదితరులు పాల్గొన్నారు.

హజ్ యాత్రకు పేర్లు నమోదు చేసుకోండి



నెల్లూరు(బారకాసు): హజ్ యాత్రకు వెళ్లాలనుకునే వారు తమ పేర్లను నమోదు చేసుకోవాలని అల్‌ఫైజీ హజ్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు మౌలానా ఇలియాజ్ కోరారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో బుధవారం ఆయన మాట్లాడారు. హజ్‌యాత్రకు విజయవాడ నుంచి వెళ్లేలా చర్యలు చేపట్టిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలను తెలియజేశారు. హజ్ యాత్రకు వెళ్లాలనుకునే వారు మూలాపేటలోని మదరసా జామియా నూరుల్ హుదా అరబిక్ పాఠశాల ఆవరణలో గల కార్యాలయంలో దరఖాస్తులను అందజేయాలని కోరారు. పాస్‌పోర్టు, ఆధార్, పాన్‌కార్డు, వ్యాక్సిన్ సర్టిఫికెట్, బ్లడ్ గ్రూప్, బ్యాంక్ పాస్‌బుక్, పాస్‌పోర్టు ఫొటోలను తీసుకురావాలన్నారు. మార్చి పది వరకు మాత్రమే ఈ అవకాశమని, వివరాలకు 98493 54712, 98482 15316 నంబర్లను సంప్రదించాలని సూచించారు. మహ్మద్ తారిఖ్ , నయీమ్, తదితరులు పాల్గొన్నారు.

మాస్టర్ అథ్లెట్లకు జాతీయ స్థాయిలో పతకాలు



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): పశ్చిమ బెంగాల్లోని మిడ్నాపూర్‌లో ఇటీవల నిర్వహించిన జాతీయ వెటరన్ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో రాష్ట్ర జట్టు తరఫున నెల్లూరీయులు 71 పతకాలను సాధించారు. దీనికి సంబంధించిన వివరాలను వెటరన్ మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు భాస్కర్‌రెడ్డి, బసవయ్య బుధవారం తెలిపారు. 25 స్వర్ణ, 33 రజత, 13 కాంస్య పతకాలను సాధించారని పేర్కొన్నారు.

మహాసభల జయప్రదానికి పిలుపు

నెల్లూరు(అర్బన్): బిహార్ రాజధాని పట్నాలో ఈ నెల 20 వరకు నిర్వహించనున్న సీపీఐ (ఎమ్మెల్) లిబరేషన్ ఆలిండియా మహాసభలను జయప్రదం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రత్యామ్నాయ శక్తులను బలపర్చేలా నిర్వహించనున్న మహాసభలకు మద్దతివ్వాలని విజ్ఞప్తి చేశారు.

మార్కెట్లోకి హోండా యాక్టివా హెచ్ స్మార్ట్



నెల్లూరు(బారకాసు): నగరంలోని షిర్డీషా హోండా షోరూమ్‌లో న్యూ యాక్టివా హెచ్ స్మార్ట్ టూ వీలర్‌ను యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆర్‌ఎం జోగారావు మార్కెట్లోకి బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా షిర్డీషా పార్ట్‌నర్ ఈశ్వర్ మాట్లాడారు. ఈ వాహనంలో స్మార్ట్ స్టార్ట్, స్మార్ట్ షేఫ్, స్మార్ట్ అన్‌లాక్ విత్ రిమోట్ కంట్రోల్, స్మార్ట్ కీ, ఎఫ్‌ఓబీ, అలాయ్ వీల్స్ కలిగి ఉంటాయని చెప్పారు. వైట్, రెడ్, యాక్సిస్ గ్రే, బ్లాక్, డీసెంట్ బ్లాక్, సెరైన్ బ్లూ రంగుల్లో వాహనం అందుబాటులో ఉంటుందని చెప్పారు. షోరూమ్ ధర రూ.82,664 అన్నారు. యూనియన్ బ్యాంక్ చీఫ్ క్రెడిట్ ఆఫీసర్ సుధాకర్‌రావు, సీజీఎం రవికుమార్, జీఎం మీరామొహిద్దీన్, ఎస్‌ఎం హరిబాబు, తదితరులు పాల్గొన్నారు.